క్లుప్తంగా

మాజీ ఎంపీపీని పరామర్శించిన కేపీ



వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న కేపీ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మాజీ ఎంపీపీ మానం వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.పి.నాగార్జునరెడ్డి సోమవారం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనలేకపోయినప్పటికీ సలహాలు సూచనలు అందించాలని కోరారు. కేపీ వెంట కౌన్సిలర్ మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కొమరోలు ఎస్సై



ఎస్సై నాగరాజు

కొమరోలు: మండల నూతన ఎస్సైగా జె.నాగరాజు సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లునాయక్ బదిలీపై ఒంగోలు 1టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లగా 2 నెలల నుంచి ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. కాగా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు నాగరాజు గుంటూరు జిల్లా నుంచి కొమరోలు పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కృషి చేస్తానని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సావిత్రిబాయి పూలేకి ఘన నివాళి



సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ తదితరులు

గిద్దలూరు రూరల్: సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం లైబ్రేరియన్ ఎస్.ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల విజ్ఞానం కోసం సావిత్రిబాయి పూలే నిరంతరం పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు రామిరెడ్డి, యువ సంస్థ సభ్యులు సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి బేరం.. మహా ఘోరం!

- నష్టాల ఘాటుతో మిర్చి రైతుల ఉక్కిరిబిక్కిరి
- ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల దెబ్బతో తగ్గిన దిగుబడి
- తడిసి మోపెడైన ఎరువులు, పురుగు మందులు, కూలి ఖర్చులు
- మార్కెట్‌లో క్వింటా రూ.10 వేలు పలుకుతున్న మిర్చి
- పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదని రైతుల ఆవేదన



కాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

కొనకనమిట్ల/తర్లుపాడు: ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి పండించిన పంట తీరా చేతికొచ్చే సమయంలో ధర అమాంతం పతనం కావడంతో రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక సతమతమవుతున్నారు. మూలిగే నక్కమీద తాటికాయ పడిన చందంగా ఈ ఏడాది పంట సాగు చేసినప్పటి నుంచి ఏదో ఒక రూపంలో మిర్చి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ఏడాది అక్టోబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు మిర్చి పంట బాగా దెబ్బతింది. కొంత మేర పంట ఉరకెత్తి పాడవగా కొందరు రైతులు మళ్లీ పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశారు. వర్షాలకు తెగుళ్ల సోకి ఇబ్బందులు పడిన రైతులకు ప్రస్తుతం పంట కోత దశలో మళ్లీ ధర రూపంలో కష్టాలు మొదలయ్యాయి. అసలే పంట దిగుబడి తగ్గిందని బాధపడుతున్న రైతులు మార్కెట్‌లో ధరలు చూసి బెంబేలెత్తారు.

కొనకనమిట్ల మండలంలో ఎక్కువగా ఎదుర్రాళ్లపాడు, కొత్తపల్లి, గార్లదిన్నె, వాగుమడుగు, నాగరాజుకుంట, గొట్లగట్టు, పాతపాడు, వద్దిమడుగు, గరిమిననపెంట, కొనకనమిట్ల, వింజవర్తిపాడు, తువ్వపాడు, చింతగుంట, చినారికట్ల తదితర గ్రామాల్లో ఖరీఫ్, రబీలో సుమారు 2300 ఎకరాల్లో తర్లుపాడు మండలంలో 1520 ఎకరాలు, మార్కాపురం రూరల్ మండల పరిధిలో 2657 ఎకరాలు, పొదిలి మండల పరిధిలో 645 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఎకరాకు నారు దగ్గర నుంచి ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయం, కోత కూలీలుకు పెట్టుబడి సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశారు. దిగుబడి నామమాత్రంగా రావడం, కూలి రేట్లు పెరగడం అదే సమయంలో ధర గతేడాదితో పోలిస్తే సగానికి సగం పడిపోవడంతో పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది క్వింటా మిర్చి ధర రూ.22 వేల నుంచి రూ.26 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.11 వేలు దక్కడమే గగనంగా మారడంతో ఏం చేయాలో అర్థం కాక రైతులు అయోమయంలో పడిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నీ విధాలా ఆదుకుంటామని ఊకదంపుడు మాటలు చెప్పిన నాయకులు తమ సంక్షేమాన్ని గాలికొదిలేశారని రైతులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిర్చి ధరలు పెరిగేలా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి 20 రోజులు గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని రైతులు మండిపడుతున్నారు.



గొట్లగట్టులో దెబ్బతిన్న మిర్చి పంట

పెట్టుబడి కూడా వచ్చేలా లేదు



"మూడెకరాల్లో మిర్చి పంటను సాగుచేశా. ఎకరాకు రూ.లక్షన్నర చొప్పున మూడెకరాలకు రూ.4.50 లక్ష పెట్టుబడి ఖర్చు వచ్చింది. మొదటి కోతలో పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రతికూల వాతావరణం, తెగుళ్ల కారణంగా కాయ నాణ్యత లేకపోవడంతో క్వింటా రూ.6 వేలకే అమ్మాం. చేతికి రూ.60 వేలు వస్తే కూలీలకు 65 వేల రూపాయలు చెల్లించాం. మరో 2 కోతలకుగాను 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది. మందుల షాపుల్లో కట్టాల్సిన అప్పులు అలాగే ఉన్నాయి. మిర్చి క్వింటా ధర రూ.20 వేలు పలికితేనే కొంతలో కొంత మిర్చి రైతులు కష్టాల నుంచి గట్టెక్కుతారు. లేకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం."

– సత్యనారాయణరెడ్డి, మిర్చి రైతు, చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడు మండలం

పొగాకు వేలం ప్రారంభం

- అత్యధిక ధర రూ.280



వేలం నిర్వహిస్తున్న గిరిరాజ్‌కుమార్

పొదిలి: స్థానిక వేలం కేంద్రంలో సోమవారం పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ముందుగా వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ ఆధ్వర్యంలోపూజలు నిర్వహించారు. తొలిరోజున రైతులు 27 బేళ్లను వేలంలో ఉంచగా సగటు ధర కేజీ రూ.280 పలికింది. 3,583 కేజీల పొగాకును తొలిరోజు వేలంలో 6 కంపెనీల వారు కొనుగోలు చేశారు. బోర్డు అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది ఇస్తున్న సూచనల మేరకు రైతులు పొగాకు గ్రేడింగ్ చేయించుకుని వేలానికి తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి స్పష్టం చేశారు.

గాలికుంటు వ్యాధిని నివారించాలి

రాచర్ల: గాలికుంటు వ్యాధిని సకాలంలో గుర్తించి నివారించుకోవాలని రాచర్ల పశువైద్యాధికారి హరిబాబు సూచించారు. సోమవారం పలు గ్రామాల్లో గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఈ నెల 31వ తేదీ వరకూ అన్ని గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గాలికుంటు సోకితే పశువులకు తీవ్ర జ్వరం, నోటి నుంచి చొంగ కారడం, నోటిలో లేదా కాళ్లల్లో పుండ్లు రావడం, పాల దిగుబడి తగ్గడం, వ్యాధి సోకిన పశువుల పాలు తాగడం వల్ల దూడలు చనిపోవడం లాంటివి జరుగుతాయని వివరించారు. ఈ లక్షణాలను పశుపోషకులు గుర్తిస్తే వెంటనే టీకాలు వేయించాలని స్పష్టం చేశారు.

ప్రైవేట్ వైద్యశాలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

కంభం: పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో సోమవారం మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉషారాణి తనిఖీ చేశారు. అనుమతి లేకుండా మందులు విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు. వైద్యశాల యాజమాన్యం నూతన లైసెన్స్‌కు దరఖాస్తు చేసి ఉన్నారని, త్వరలోనే మంజూరవుతుందని చెప్పారు. రోగులకు డాక్టర్ పర్యవేక్షణలో కొంత వరకు మందులు ఇచ్చే వెసులుబాటు ఉందని, అదే సమయంలో వైద్యశాలలో మందుల షాపు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. అనుమతులు మంజూరయ్యే వరకు మందులు విక్రయించరాదని యాజమాన్యానికి సూచించినట్లు పేర్కొన్నారు.

నామమాత్రపు స్పందన

- పొదిలిలో ఒక్క అర్జీ దాఖలు
- పలు శాఖల అధికారులు గైర్హాజరు



పొదిలిలో మీకోసంలో పాల్గొన్న పలు శాఖల సిబ్బంది

పొదిలి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమం నామమాత్రంగా సాగుతోంది. కేవలం అర్జీలు తీసుకోవటం తప్ప, పరిష్కారాలు లేకపోవడంతో ప్రజలు మీకోసం కార్యక్రమం వైపు కన్నెత్తి చూడటం లేదు. మరో వైపు మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండగా సోమవారం కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం, హౌసింగ్, ఐసీడీఎస్, నగర పంచాయతీ తరఫున ఆయా శాఖల సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు పాల్గొని అర్జీలు స్వీకరించకపోవడం కూడా గ్రీవెన్స్ నామమాత్రంగా సాగడానికి కారణమవుతోంది. కాగా మీ కోసం కార్యక్రమంలో కేవలం ఒక్క అర్జీ భూసర్వే కోసం వచ్చిందని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సమాచారం ఇస్తున్నామని, పలు శాఖల అధికారులు, సిబ్బంది ఎంపీడీఓ కార్యాలయంలో వీసీలో పాల్గొన్నారని చెప్పారు. సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు.

ఘనంగా పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ఠ



సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన పట్టాభిరామస్వామి దేవస్థానంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు 3 రోజులుగా ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి స్వామి వారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు చేశారు. ఉదయం సీతారామస్వామి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం సీతారామ స్వామి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



డాక్టర్ కనకదుర్గ



మేడా బద్రీనాథ్

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆ పార్టీ ఇంటలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మేడా వెంకట బద్రీనాథ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతలు అప్పగించిన మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కనకదుర్గ శ్రీశైల దేవస్థాన ట్రస్టు బోర్డు మెంబరుగా సేవలందించారు. ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌గా ఉన్నారు. మేడా బద్రీనాథ్ రాష్ట్ర ఎమ్ఎస్ఎమ్ఈ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల వరకు సేవలందించారు.

సమస్యలు పరిష్కరించండి



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: తమ సమస్యలను పరిష్కరించాలని మీ కోసం కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు ఇచ్చారు. కంభం పట్టణానికి చెందిన పీవీ లక్ష్మీనారాయణ, మరికొంత మందిరైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. బేస్తవారపేట మండలం చింతలపాలెం గ్రామ రెవిన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి, పోరంబోకు, కాలువ భూమిగా ఉన్న పొలాన్ని కొందరు ఆక్రమించుకుని పంటకాల్వను పూడ్చారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అర్జీ ఇచ్చారు. బేస్తవారపేటలోని 2వ వార్డుకు చెందిన మహిళలు పడమట వీధి, తేరుబజారులో రోడ్డు ఆక్రమణ జరిగిందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- రూ.4600 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో అవస్థలు
- పేద విద్యార్థుల పక్షాన ఈ నెల 12న ఒంగోలులో యువత పోరు
- వైఎస్సార్ సీపీ యువత పోరుకు పార్టీ శ్రేణులు, విద్యార్థులు కదం తొక్కాలి
- పోస్టర్ల ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, ఉడుముల

పేద విద్యార్థులకు గుదిబండలా కూటమి ప్రభుత్వ తీరు



మార్కాపురంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన నాయకులు



గిద్దలూరులో వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న కేపీ నాగార్జున రెడ్డి, నాయకులు

మార్కాపురం టౌన్/గిద్దలూరు రూరల్/కొనకనమిట్ల: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు విద్యార్థులకు గుదిబండలా మారిందని వైఎస్సార్ సీపీ మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జులు మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. కళాశాలలకు ఫీజులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఒంగోలు కలెక్టరేట్ వద్ద తలపెట్టిన 'యువత పోరు' ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మార్కాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అన్నా రాంబాబు, గిద్దలూరులో కేపీ నాగార్జునరెడ్డి, చినారికట్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత 5 త్రైమాసికాలుగా రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలు రూ.4,600 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇవ్వాలని, నూతన మెడకల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని, పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా పేద విద్యార్థులను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న పోరాటానికి యువత కదం తొక్కాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న రాష్ట్రంలో నిర్మాణం ప్రారంభించిన 17 మెడికల్ కాలేజీలను నిలుపుదల చేయడం అత్యంత దారుణమన్నారు. 2018–19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.1800 కోట్ల బకాయిలను జగనన్న ప్రభుత్వం రాగానే చెల్లించారని గుర్తుచేశారు. విద్యకు ప్రాముఖ్యతను ఇస్తు జగనన్న ప్రభుత్వంలో విద్యారంగంలో ఎన్నో వినూత్న మార్పులను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక పరిపాలనతో అన్ని రంగాలు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల ఫీజులు చెల్లించేంత వరకు వైఎస్సార్ సీపీ పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణలో మార్కాపురంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్న హనుమారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్–2 అంజమ్మ శ్రీనివాసులు, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి పత్తి రవిచంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కంది ప్రమీలారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, కొనకనమిట్ల ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, మండల పార్టీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, లయోలా చెంచిరెడ్డి, దుర్గాభాస్కర్, నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, కె.సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, రామనారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఎం.శ్రీనివాసులు, కొత్త కృష్ణబుశెట్టి నాగేశ్వరరావు, చదలవాడ రమణారెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, నజీర్, రఫీ, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.గోపాల్‌రెడ్డి, నుసుం బాలచంద్రుడు, పోరుమామిళ్ల విజయలక్ష్మి, గిద్దలూరు కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బైళ్ల దేవదాసు, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, కౌన్సిలర్ మానం బాలిరెడ్డి, ఆర్యవైశ్య విభాగం నాయకులు గర్రె చిరంజీవి, ఓబులరావు, రాచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు దేవిశ్రీరంగం, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, సూరా స్వామిరంగారెడ్డి, నాసరి శ్రీనివాసులు, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సునిల్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు, చినారికట్లలో విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి సంజీవరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి శిరిగిరి కోటేశ్వరరావు, మరవతు వెంకటేశ్వరరెడ్డి, మోరా రమణారెడ్డి తలిదరులు పాల్గొన్నారు.



చినారికట్లలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉడుముల శ్రీనివాసరెడ్డి

హిందువులపై దాడి నిందితులను శిక్షించాలి



ర్యాలీలో పాల్గొన్న హిందూ సంఘాల ప్రతినిధులు

మార్కాపురం: అన్నమయ్యజిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని హిందూ చైతన్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిద్దలూరులో నిరసన ప్రదర్శన నిర్వహించి, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. హిందూ సంఘాల ప్రతినిధులు పీవీ కృష్ణారావు, శాసనాల సరోజిని, బి.చంద్రశేఖర్, జె. శ్రీనివాసులు, ప్రవీణ్, లక్ష్మీదేవి తదితరులు మాట్లాడుతూ.. హిందువులపై జరుగుతున్న ఏకపక్ష దాడులను ఖండిస్తున్నామన్నారు. గత ఆరు నెలలుగా పెడన, రాయచోటి, వి.కోట, దాచేపల్లి తదితర ప్రాంతాల్లో ప్రశాంతంగా పండగలు చేసుకుంటున్న హిందువులపై కొందరు దాడులు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు పక్షపాతం చూపకుండా బాధితలకు న్యాయం చేయాలని కోరారు.